ఈ-క్రాప్‌తో రైతుకు మేలు

- చురుగ్గా రబీ సీజన్ పంట నమోదు
- రైతుకు గిట్టుబాటు ధర

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఈ-క్రాప్ విధానం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకతతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో రబీ సీజన్‌కు ఈ-క్రాప్ నమోదు ఇప్పటికే పూర్తికాగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బుధవారం నుంచి ప్రారంభం కానుంది. వరి సాగు ప్రారంభమైన నాటి నుంచి మసూళ్లు పూర్తయ్యే వరకూ ఈ-క్రాప్ విధానం కొనసాగుతుండటంతో రైతులు ఎప్పుడైన తన నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించింది. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ కియోస్కో మెషీన్‌లో నిక్షిప్తం అవ్వడం ద్వారా సమయానికి ఎరువులు, పురుగు మందులు రాయితీ, పంటల భీమా, నాణ్యమైన విత్తనాలు అందే వీలు ఏర్పడింది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 12 మండలాల్లో సుమారు 78 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా 90,187 మంది రైతులు ఈ-క్రాప్‌లో ఇప్పటికే నమోదైన వారిలో ఉన్నారు.



పెదపళ్లలో ఎరువులు, విత్తనాలు నమోదు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రం

ఈ-క్రాప్ నమోదు ఈజీ

రాష్ట్ర ప్రభుత్వం 2019లో రబీలో ఈ-క్రాప్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (ఆర్‌బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్‌బీకేల్లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను రెవెన్యూ వెబ్ ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అంశాల ఆధారంగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ-పంట నమోదు చేస్తున్నారు. రైతు తన ఆధార్‌కార్డు జెరాక్స్‌తో పాటు 1బీ లేదా పట్టాదార్ పాస్‌బుక్ జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను రైతు భరోసా కేంద్రానికి తీసుకువెళ్లి ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి. కౌలు రైతులైతే అదనంగా సీసీఆర్‌సీ కార్డును జతపరచాలి. ఈ-క్రాప్ నమోదులో జవాబుదారీతనంగా ఉండేందుకు రైతులకు రశీదులు సైతం అందజేస్తున్నారు.

రైతుల్లో అవగాహన పెరిగింది



ఈ-క్రాప్ విధానంపై రైతులకు అవగాహన పెరిగింది. రైతులు స్వచ్ఛందంగా ఆర్బీకేలకు వచ్చి పంట నమోదు చేసుకుంటున్నారు. ఆర్బీకేల్లో అధికారులు సక్రమంగా బాధ్యతను నిర్వహించడం వల్ల రైతులకు తమ పంట ఉత్పత్తులపై భరోసా ఏర్పడింది.

– పి.మధు, ఆర్‌బీకే క్షేత్రస్థాయి సహాయకుడు, సంధిపూడి

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర, రాయితీలను అందించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-క్రాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ-క్రాప్ విధానంలో రైతులందరికీ మేలు జరుగుతుంది.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏఓ, ఆలమూరు

విద్యార్థులకు భోజనం ప్లేట్ల పంపిణీ

అంబాజీపేట: విద్యార్థులు భోజనం చేసేందుకు దాతలు సమకూర్చిన 350 స్టీల్ ప్లేట్లను గంగలకుర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వైఎస్ నాగజ్యోతికి మంగళవారం అందజేశారు. కొల్లూరి కామేశ్వరి కుమారులు బాపురావు, విశ్వనాథంలు సుమారు రూ.40 విలువైన 350 స్టీల్ ప్లేట్లు (కంచాలను) బహూకరించారు. రిటైర్డు హెచ్‌ఎం నందూరి సుబ్బారావు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంకాలం అల్పాహారం నిమిత్తం రూ.20 వేల నగదును హెచ్‌ఎం నాగజ్యోతికి అందజేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలను సమకూర్చేందుకు అంగీకారం తెలిపారని హెచ్‌ఎం చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో పేకాట నిర్వహిస్తున్న శిబిరంలో మంగళవారం ఆలమూరు పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.34,750 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య సేవలు

మామిడికుదురు: నగరం సచివాలయం-2లో కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. కిమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యులు 252 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులు ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలకు తోడు ప్రైవేటు ఆస్పత్రులు అందిస్తున్న సేవలు అమూల్యమైన వని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు, వార్డు సభ్యులు బత్తుల సురేష్, రాయుడు ఆనందబాబు, మొల్లేటి శ్రీనివాస్, స్థానికులు జాలెం సుబ్బారావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది ఈ సందర్భంగా 55 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 15 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి నిర్ధారించారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు ఖండవిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

కొత్తపేట: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి క్షేత్రంలో సాధారణ భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో ఎం.ముక్కంటి, ఎంపీపీ మార్గన గంగాధరరావు దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. దేవతలు నిర్మించిన ఆలయంగా ప్రసిద్ధికెక్కిన పలివెల ఉమా కొప్పేశ్వర క్షేత్రానికి అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆర్డీవో ముక్కంటి, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల అధికారులతో కలసి కల్యాణం, మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల సంఖ్య, ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. అదే రోజు శనిత్రయోదశి పర్వదినం సందర్భంగా మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి క్షేత్రానికి లక్షలాదిగా భక్తులు వస్తారనే అంచనాతో మందపల్లి మీదుగా సాగే రావులపాలెం-అమలాపురం ట్రాఫిక్‌ను ఈతకోట, పలివెల మీదుగా మళ్లిస్తున్నందున ఆ వాహనాలు, పలివెల క్షేత్రానికి వచ్చే భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పోలీస్ అధికారులకు సూచించారు. ఆ మేరకు స్థానిక ప్రైవేట్ పాఠశాల గ్రౌండ్‌లో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్వామి దర్శనానికి తొక్కిసలాట జరగకుండా చర్యలు తీసుకోవాలని, వీఐపీ భక్తుల దర్శనంతో సాధారణ భక్తుల దర్శనానికి ఇబ్బంది లేకుండా, మధ్యాహ్నం రథోత్సవం సజావుగా సాగేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, ఎస్ఐ వి.మణికుమార్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, దేవస్థానం ఈఓ ప్రసాదరాజు, పంచాయతీ కార్యదర్శి పి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



పలివెలలో శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీవో ముక్కంటి, ఎంపీపీ గంగాధరరావు

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం



మామిడికుదురులో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు



కొత్తపేటలో సైకిల్ తొక్కుతున్న డాక్టర్ భారతి, అధ్యాపకులు, విద్యార్థులు

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు హెల్త్ మేళాలో భాగంగా మంగళవారం సైక్లింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని ఆధ్వర్యంలో జరిగిన పోటీలో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 216వ నంబర్ జాతీయ రహదారి వరకు విద్యార్థులు సైకిళ్లు తొక్కారు. పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.వెంకన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన సైకిల్ పోటీల్లో విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపేట: సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, అవిడి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా ఆరోగ్యమేళా, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.అరుణ్‌కుమార్, అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇందిరాభారతిరాయి సంయుక్త ఆధ్వర్యంలో సైకిల్ తొక్కండి, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోండి, ప్రకృతిని కాపాడండి, అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ వాడ సద్గుణరావు, పీహెచ్‌సీ సిబ్బంది, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముక్కామలలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం వల్ల ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారులు ఎ.ఇంద్రావతి, జీవీ గీతాంజలి అన్నారు. ఆరోగ్య మేళా కార్యక్రమంలో భాగంగా ముక్కామలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సైకిల్ తొక్కండి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోండి, ప్రకృతిని కాపాడంటూ మంగళవారం విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మంగళవారం ఆరోగ్య మేళా జరిగింది. కొత్తపేట డివిజన్ ఎడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత నేతృత్వంలో పెదపళ్ల, చొప్పెల్ల వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు తమ వైద్యారోగ్య సిబ్బందితో కలసి సైక్లోథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళ్లి సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: రోజూ సైకిల్ తొక్కడం ద్వారా శారీరక ఆరోగ్యం సమకూర్చుకోవాలని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. మంగళవారం సఖినేటిపల్లిలో ఆయుష్మాన్ భారత్ సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా ఆయన సైకిల్ యాత్రకు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ఎంపీపీ ఈ పాదయాత్ర చేశారు. సఖినేటిపల్లి సెంటర్ నుంచి స్థానిక మూడు తూముల సెంటర్ మీదుగా తిరిగి సెంటర్ వరకూ సాగింది. పాఠశాల హెచ్‌ఎం నరహరిశెట్టి సత్యనారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, పీఎల్ఎస్ స్వామి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలను ప్రభుత్వం పరం చేయడమే లక్ష్యం

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ పరం చేసే దాకా పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాల సమావేశం పేర్కొంది. ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పూలే అంబేడ్కర్ భవనంలో జరిగిన సదస్సులో పలువురు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కొందరు ప్రయాణం చేస్తున్నారని వాటిని విరమించుకోవాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘాల సలహాదారుడిగా తాడి సహదేవ్‌ను నియమించారు. సమావేశంలో దేవ రాజేంద్రప్రసాద్, నల్లి శివకుమార్, రాపాక మహేశ్, పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్ర, సంజయ్, పవన్, నవీన్, మణికంఠ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడులు

అయినవిల్లి: పంటల సంరక్షణలో సామూహిక ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఉద్యాన శాఖ అధికారి ఎం.బబిత అధ్యక్షతన శానపల్లిలంకలో తోటబడి కార్యక్రమం నిర్వహించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ పసుపు రంగు అట్టలు పెట్టడం, వేపనూనె పిచికారీ చేస్తూ ట్రైకోడెర్మ విరిడీ వంటి జీవ నియంత్రణ పద్ధతులు పాటించడం ద్వారా మంచి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు ప్రభుత్వం అనేక విధాలగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త మమత కొబ్బరిలో కంద పంటను నాటే విధానం విత్తన శుద్ధి, సస్యరక్షణ చర్యలు మొదలగు అంశాలను రైతులకు సూచించారు. ఎస్సీ సబ్ ప్లాన్‌లో రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పచ్చిమాల సుబ్బారావు, ఉద్యాన సహాయకులు శ్రీనుబాబు, ప్రసాద్, సుధాకర్ తదితరులు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

అధ్వానస్థితిలో లింకు రోడ్డు

మామిడికుదురు: మామిడికుదురు శ్మశానం దగ్గర నుంచి లూటుకుర్రు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై పలు చోట్ల మెటల్ లేచిపోయి గోతులు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం మీదుగా లూటుకుర్రు వెళ్లే కాలువగట్టు రోడ్డు మరింతగా పాడైపోయింది. ఈ రోడ్డుపై మెటల్ లేచిపోయి ప్రయాణికులను తీవ్ర అసహనానికి గురి చేస్తోంది. సుమారు రెండు కిలోమీటర్లు పొడవు ఉన్న ఈ రోడ్డు అధ్వానస్థితిపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలం క్రితమే ఈ రోడ్డు పాడైపోయిన దీన్ని అభివృద్ధి చేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దీనిపై స్పందించి ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, దీన్ని పక్కాగా అభివృద్ధి చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న మామిడికుదురు-లూటుకుర్రు లింకురోడ్డు

కర్రలతో దాడి

ఆలమూరు: మండలంలోని మడికి శివారు నాగులపేటలో అల్లరిమూక కర్రలతో దాడి చేసి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసింది. స్థానికుల కథనం ప్రకారం ఈనెల 11న మల్లవానితోటలో కనకదుర్గ అమ్మవారి జాతర జరిగింది. ఈసందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడటంతో పెద్దలు సర్దిచెప్పి పంపించేశారు. అయితే గ్రామానికి చెందిన శింగంరెడ్డి వీరబాబు తన అనుచరులతో కలసి సోమవారం రాత్రి కర్రలతో దాడి చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అల్లరిమూకను చెల్లాచెదురు చేశారు. దీంతో భయాందోళనలకు గురైన నాగులపేట వాసులు మంగళవారం ఆలమూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని అల్లరిమూకపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై దాడికి పాల్పడిన వారి వివరాలు సేకరించి 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి

సఖినేటిపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య నాడు రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికారని రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు అన్నారు. మంగళవారం మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయం వద్ద ఆయన అధ్యక్షతన సంజీవయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి టాండన్ రాజు, పారిశ్రామిక వేత్త గెద్దాడ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వృద్ధాప్య పింఛన్‌ను ప్రవేశపెట్టిన మానవతావాది, పేదలకు ఆరు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన సామ్యవాది, కార్మికులకు బోనస్ తెచ్చిన మహోన్నత వ్యక్తి సంజీవయ్య అని వక్తలు ఆయన సేవలను కొనియాడారు. సమాఖ్య అధ్యక్షుడు గెద్దం ప్రభాకర్‌రావు, ఎస్.తపోబ్రహ్మం, పి.నారాయణకుమార్, టి.రవికుమార్, చింతా శేషు, మేడిది ఏసయ్య, నల్లి సత్యం, జంపన ప్రసాదరావు పాల్గొన్నారు.



మోరిలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న టాండన్ రాజు, నాగేశ్వరరావు

ఆర్టీసీ లక్కీ డిప్ విజేతలకు బహుమతులు

రావులపాలెం: స్థానిక సామర్లకోట రూట్‌లో ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీమ్‌కు సంబంధించి మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద ప్రయాణికుల సమక్షంలో డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి గొల్లల మామిడాడకు చెంది ఎం.కనకవల్లి, రెండో బహుమతి అనపర్తికి చెందిన టి.ప్రభలకు అందజేసినట్టు డిపో మేనేజర్ కేవీఎంఎస్ కుమార్ తెలిపారు.

వరాహాల పందెం నిర్వాహకులపై కేసు

అయినవిల్లి: మండలంలోని క్రాపలో పందుల పందెం నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన బండి ఏసు, బండి మణి రక్షణ ఆనంద్, గుత్తుల మీరయ్యలు పందుల పందెం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై పందెం నిర్వహణ స్థలానికి తన సిబ్బంది వెళ్లి పందెం నిర్వాహణను నిలుపుదల చేశారు. నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా టీమ్

మలికిపురం: రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా టీమ్‌ను ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు మంగళవారం ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం నిర్ణయం మేరకు వీరిని నియమించినట్లు ఆయన తెలిపారు. రాజోలు మండల కన్వీనర్‌గా వడ్డి రాకేశ్, కోకన్వీనర్లుగా చెల్లింగి నవీన్, కొండిబోయిన జయకుమార్, కనపాల సురేష్‌బాబు, కొప్పాడి దుర్గాప్రసాద్‌లను నియమించారు. మలికిపురం మండల కన్వీనర్‌గా జిల్లెళ్ళ ఉదయ్‌కిరణ్, కోకన్వీనర్‌లుగా మహ్మద్ సమీర్, పిల్లి శ్రీనివాస్, కాండ్రేగుల లక్ష్మీవివేక్, రాపాక అజయ్‌లను, సఖినేటిపల్లి మండల కన్వీనర్‌గా చొప్పల అనిల్, బొందుకూరి సుగుణాకర్, బుంగ రమేష్, ముత్యాల నాని, గొల్ల విజయ్‌లను, మామిడికుదురు మండల కన్వీనర్‌గా గుబ్బల మణికంఠలను నియమించినట్లు పేర్కొన్నారు.

ఎంపీ అనురాధను కలసిన మోడేకుర్రు గ్రామస్తులు



ఎంపీ అనురాధకి బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న మోడేకుర్రు గ్రామస్తులు

అల్లవరం: కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామస్తులు మొగల్లమూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ అనురాధను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.15 లక్షల నిధులు మంజూరు చేసినందుకు ఎంపీ అనురాధకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీని కలసిన వారిలో కుడుపూడి వెంకటేశ్వరరావు, చిక్కాల వెంకటేశ్వరరావు, ఎల్.శ్రీను, ముంగర సూరిబాబు, జక్కంశెట్టి గంగారమేష్, జక్కంశెట్టి కొండబాబు తదితరులున్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మౌనిక

అంబాజీపేట: జాతీయ స్థాయి అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీలకు అంబాజీపేట కొర్లపాటివారిపాలేనికి చెందిన మీసాల మౌనిక ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ కోచ్, పీడీ రెడ్డిపల్లి ప్రసాద్ తెలిపారు. ఇటీవల ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఫెడరేషన్ అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున పాల్గొంది. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చడంతో జాతీయ స్థాయికు ఎంపికైందన్నారు. త్వరలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననుందని ప్రసాద్ చెప్పారు. మౌనిక అమలాపురం శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో 8వ తరగతి చదువుతుందన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన మౌనికను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్, గ్రామస్తులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు అబ్బులు ఎంపిక



విలువిద్య పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడల్ అందుకుంటున్న అబ్బులు

ఆలమూరు: మండలంలోని కలవచర్లకు చెందిన టి.అబ్బులు రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల రాజమహేంద్రవరంలోని వల్లా ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో ఇండియన్ రౌండు రిక్వర్ కాంపౌండ్ విలువిద్య పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో ఈనెల 28న విజయవాడలోని చెరుకూరి వల్లా విలువిద్య అకాడమీ నందు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విలువిద్య పోటీల నిర్వహణ అధ్యక్షుడు కేఎస్ఎస్ గోపాలకృష్ణ మంగళవారం విలేకరులకు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగరెడ్డి, తహసీల్దార్ కిశోర్‌బాబు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెం వద్ద ఈనెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. అంగర గ్రామానికి చెందిన రాగం నాగేశ్వరరావు (34) తన కుటుంబ సభ్యులతో బైక్‌పై ఆత్రేయపురం బంధువుల ఇంటికి వచ్చాడు. ఈనెల 5న తన స్వగ్రామం అంగర వెళ్లేందుకు బయలుదేరాడు. మార్గంమధ్యలో మెర్లపాలెం సమీపంలో కారు ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తిని రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.